క్లుప్తంగా

15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం డిసెంబర్ 15 నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణప్ప మంగళవారం తెలిపారు. 15 నుంచి 60 సంవత్సరాల వరకూ వయసు ఉన్న వారు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ తదితర ఆటల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ పేర్లను సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థికి ఆర్చరీ కిట్ అందజేత



గోవర్ధన్‌రెడ్డికి ఆర్చరీ కిట్ అందజేస్తున్న హెచ్‌ఎం సుజాతమ్మ

శింగనమల: శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గోవర్ధన్‌రెడ్డి ఆర్చరీలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అతడికి పాఠశాల పూర్వ విద్యార్థి, నార్పల ఎంఈఓ–2 నారపరెడ్డి రూ.12 వేలు విలువ చేసే లార్చరీ కిట్‌ను అందించారు. ఈమేరకు మంగళవారం విద్యార్థికి హెచ్‌ఎం సుజాతమ్మ కిట్‌ను అందించారు. విద్యార్థికి ఆర్చరీ కిట్‌ను అందజేసిన పూర్వ విద్యార్థికి పీడీ నందకుమార్ , ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

గని విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న అధికారులు

శింగనమల: జూలకాల్వ కొండల్లో సున్నపు రాయి, డోలమైట్, వైట్‌షేల్ గని విస్తరణపై మంగళవారం ఆర్డీఓ వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఆర్డీఓ మాట్లాడుతూ 35.265 హెక్టార్ల విస్తీర్ణంలో గనులు విస్తరించేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారని, అభ్యంతరాలుంటే తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ఎవరూ అభ్యంతరాలు తెలపలేదు. ఏపీపీసీబీ ఇంజినీర్ పివి. కిశోర్‌రెడ్డి, ఏఈఈ కృష్ణారెడ్డి, తహసీల్దార్ ఈశ్వరమ్మ, జూలాకాల్వ గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: పట్టణంలోని 16వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారమైంది. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వార్డు కౌన్సిలర్ నరేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, సీనియర్ నేత వెల్డింగ్ అబ్దుల్ రవూఫ్ చొరవ తీసుకుని కాలనీలో తాగునీటి పైప్‌లైన్లతో పాటు కుళాయిలు ఏర్పాటు చేయించారు. మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ కుళాయిలను ప్రారంభించారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం



క్రీడా సామగ్రి అందిస్తున్న జెడ్పీటీసీ భాస్కర్

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. మండలంలో 19 పంచాయతీలకు క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎంపీడీఓ తేజోత్స్న, సర్పంచ్ పార్వతి, ఎంఈఓలు గురుప్రసాద్, లింగా నాయక్, ఈఓఆర్డీ దామోదరమ్మ, పీఈటీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నిదనవాడ గ్రామస్తులకు నగదు అందిస్తున్న దృశ్యం

శింగనమల: నిదనవాడలో పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి కంచిరెడ్డి ఫౌండేషన్ నిర్వాహకులు రూ.50 వేలు విరాళం ప్రకటించారు. వైఎస్సార్ సీపీ యువనేత కంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకొని మంగళవారం ఆలయ నిర్వాహకులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో కంచిరెడ్డి కృష్ణారెడ్డి, కంచిరెడ్డి కోటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన పకడ్బందీగా చేపట్టండి



బీకేఎస్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న



గుంతకల్లులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: గ్రామాల్లో కుల గణన సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సర్పంచ్, ఎంపీటీసీ, ఉపాధిహామీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా ఈ నెల 9 నుంచి ప్రతి ఇంటికి వెళ్లి కులగణన సర్వే చేయాలన్నారు. వారం రోజుల వ్యవధిలో సర్వే పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం కులాలను గుర్తించాలన్నారు. ఇందుకు సర్పంచ్, ఎంపీటీసీలు సహకరించాలని కోరారు. ఎంపీడీఓ శివాజీరెడ్డి, సర్పంచ్‌లు రమేష్, చిదంబరి, ఆంజనేయులు, బేడల లక్ష్మీదేవి, ఏపీఓ మద్దిలేటి, ఎంపీటీసీ చిన్న వీరన్నగౌడ్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కులగణనపై పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఉషారాణి మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి కులాల వారీగా సర్వే చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ మల్లికార్జున, ఏఎస్‌డబ్ల్యూఓ కవిత కోరారు. మంగళవారం కౌన్సిల్‌హాల్‌లో కులగణన సర్వేపై మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, కుల, ప్రజాసంఘాల పెద్దలు, మేధావులు, వార్డు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కులగణన సర్వే తీరును కమిషనర్, ఏఎస్‌డబ్ల్యూఓలు వివరించారు. దీనిపై ఆయా వర్గాల నుంచి అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 దశాబ్దాల తర్వాత ప్రభుత్వం పకడ్బందీగా, పారదర్శకంగా కులగణన నిర్వహించనుందన్నారు. అంతకు ముందు కులగణనపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, టీపీఎస్ అబ్దుల్‌సత్తార్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ మురళీ, వివిధ విభాగాల అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

యల్లనూరు: కుల గణనను పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ వీరరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కుల గణనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనలో ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. తహసీల్దార్ సుమతి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ తిమోతి, సర్పంచులు రామాంజులరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: ఈనెల 9వ తేదీ నుండి ప్రారంభమయ్యే కుల గణన ప్రక్రియను విజయవంతం చేయాలని తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన జీవనం విధానం అందించేలా ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అన్ని కులాల ప్రజలకు సాంఘిక, ఆర్థిక, విద్య, భౌగోళిక జీవన ప్రమాణాల ఆధారంగా సమగ్ర కుల ఆధారిత సమాచారం సేకరించడానికి కుల గణన నిర్వహిస్తోందన్నారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, ప్రజాప్రతినిధులు అధికారులు, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ, కేజీబీవీ, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: ఈ నెల 9 నుంచి కులగణన సర్వే పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ లక్ష్మినారాయణ, తహసీల్దార్ బాలమ్మ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కులగణనపై సమీక్ష నిర్వహించారు. ఎంఈఓ కాశెప్ప ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఈఓ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



తాడిపత్రి మండలం పెద్ద పోలమడలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



గూగూడులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నాగేశ్వరావు

నార్పల: రాష్ట్రాభివద్ధి జగనన్నతోనే సాధ్యమని ఎంపీపీ నాగేశ్వరావు పేర్కొన్నారు.మంగళవారం గూగూడు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించడంతోపాటు గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. సర్పంచు రమణకుమారి, ఎంపీటీసీ రాజారెడ్డి, కో ఆప్షన్ షాబీరా, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు సూర్యనారాయణ, గోపాల్, శివయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పెద్ద పోలమడ గ్రామంలో మంగళవారం మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ఎండగడుతూ వైఎస్సార్ ప్రభుత్వంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. సర్పంచ్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, నాయకులు నాగరాజు, మోహన్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలనపై అవగాహన అవసరం



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఈవోఆర్డీలు

గుంతకల్లు రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధి, పరిపాలనా విధానంపై సచివాలయ సిబ్బందికి ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఎంపీడీఓ వెంకటరమణప్ప సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీడీఓ, ఈవోఆర్డీ నరసింహులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదాయ వనరులను ఉపయోగించుకుంటూ గ్రామాలను ఏవిధంగా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. లే అవుట్ల క్రమబద్ధీకరణతోపాటు, పంచాయతీ నిధుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సచివాలయాల్లో నగదు రహిత చెల్లింపులను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కుల గణనను విజయవంతం చేయాలని సూచించారు.

ఘనంగా విభిన్నప్రతిభావంతుల దినోత్సవం



పెద్దవడుగూరులో మానవహారంగా ఏర్పడిన విభిన్న పతిభావంతులు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ స్కూల్ నుంచి గుత్తి రోడ్డు సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. ఎస్టీఎల్ ఇంద్రప్రసన్న విభిన్న ప్రతిభావంతులకు ఆర్డీటీ సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. నాయకులు బయపరెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలో మంగళవారం గౌతమిపురి వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటేష్, ఉపాధ్యక్షురాలు ముత్యాలమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం



ఆనంద్ కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: అనారోగ్యంతో కర్నూలు చికిత్స పొందుతున్న మోదినాబాద్‌కు చెందిన ఆనంద్ వైద్యఖర్చులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో ఆనంద్ ఆరోగ్య పరిస్థితిని అతని కుటుంబసభ్యులకు అడిగి తెలుసుకున్నారు. అక్కడి వైద్యులతో ఎమ్మెల్యే వైవీఆర్ ఫోన్‌లో మాట్లాడి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అతడికి మెరుగైన వైద్యసేవలందించి సూచించారు. 37వ వార్డు ఇన్‌చార్జ్ వరుసరాముడు, నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయండి



చైర్‌పర్సన్ భవానికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సాయికృష్ణ హాస్పిటల్ సర్కిల్ వద్దనున్న మున్సిపల్ రిజర్వ్‌డ్ స్థలంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవానిని సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం సీపీ ఛాంబర్‌లో ఆమెకు వినతిపత్రాన్ని అందజేశారు. నిరుద్యోగ యువత, పట్టణ ప్రజలను దృష్టిలో ఉంచుకుని గ్రంథాలయాన్ని నిర్మించాలని నాయకులు నాగరాజు, షబ్బీర్, వెంకట్, మోహన్ కోరారు.

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాలు ఎంతో అవసరమని ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ డేటా సైన్స్ వారు ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా 7 రోజులుగా బీటెక్ విద్యార్థులకు 'గేమ్ డిజైన్ యూజింగ్ బిల్డ్ బాక్స్'పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. బిల్డ్ బాక్స్ సాఫ్ట్‌వేర్‌తో ఎవరైనా అద్భుతమైన గేమ్‌లను సృష్టించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు చిత్రలింగప్ప, డాక్టర్ హేమంత్ కుమార్, డాక్టర్ శశికళ, శిరీష, మానస, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజేపీ స్కూల్ స్వీపర్‌కు చేయూత



స్వీపర్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎంజేపీ స్కూల్ సిబ్బంది

శింగనమల: ఈస్ట్ నరసాపురంలోని మహాత్మా జ్యోతిపూలే బీసీ గురుకుల పాఠశాలలో స్వీపర్ లక్ష్మి కుటుంబానికి రాష్ట్రంలోని ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది చేయూతనిచ్చారు. లక్ష్మి భర్త ఇటీవల మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎంజేపీ బీసీ గురుకుల సిబ్బంది రూ.1,03,820 ఆర్థికసాయం అందించినట్లు ప్రిన్సిపాల్ సంగీతకుమారి తెలిపారు. పిల్లల పేరు మీద మొత్తాన్ని పదేళ్లపాటు డిపాజిట్ చేశామన్నారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యుడు నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

పామిడి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండలస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈనెల 9న గుంతకల్లులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రపై చర్చించనున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

గుత్తి: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం వైఎస్సార్‌సీపీ అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి రావాలని కోరారు.

మద్యం మత్తులో అన్నావదినపై దాడి

అనంతపురం క్రైం: స్థానిక గుల్జార్ పేటలో మద్యం మత్తులో ఓ యువకుడు మంగళవారం అన్నా వదిన, తల్లిపై దాడి చేశాడు. బాధితులు 100కు ఫోన్ చేయడంతో బ్లూకోట్స్ పోలీసులు తప్పతాగిన యువకుడిని స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించి, సాధ్యపడక బాధితులను పిలిపించుకొని ఫిర్యాదు తీసుకున్నారు. సీఐ శివరాముడు బాధితులతో మాట్లాడి, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. పట్టపగలు మహిళపై దాడి చేయడమే కాకుండా దుస్తులు కూడా చించేయడంతో బాధిత మహిళ పోలీసులకు ఎలాగైనా మాకు రక్షణ కల్పించాలని కోరింది. గతంలో కూడా ఇలాగే దాడి చేశాడని తెలిపింది. బాధితుల ఫిర్యాదు స్వీకరించిన సీఐ.. తాగుడుకు బానిసై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న యువకుడిని కౌన్సెలింగ్ సెంటర్‌కు పంపాలని సూచించారు.

సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య

గుంతకల్లుటౌన్: యువతలోని సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా ఎస్కేయూలో అటల్ ఇంక్యుబేషన్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, సెంటర్ మేనేజర్ డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సదస్సులో నూతన వ్యాపార వ్యవస్థాగతపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం, ఆయా ప్రాంతాల వనరుల వినియోగం ద్వారా వస్తుసేవల ఉత్పత్తికి కృషి చేస్తే ఆ ప్రాంతం సమగ్రావృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్ ట్రైనర్ డాక్టర్ జ్యోతి, షహీద్‌తో, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 425 దరఖాస్తులు

గుత్తి రూరల్: మునిసిపాలిటీతో పాటుగా మండల వ్యాప్తంగా ఓటు నమోదుకు 425 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 2, 3 తేదీల్లో మండల వ్యాప్తంగా ఉన్న 76 పోలింగ్ బూత్‌లలో 425 మంది కొత్త ఓటరుగా నమోదు, 39 మంది ఓట్లు తొలగించాలని దరఖాస్తులు ఇచ్చారన్నారు. మార్పు, చేర్పులు, సవరణల కోసం 84 మంది విజ్ఞప్తులు అందాయన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

యల్లనూరు: స్థానిక పోలీసు స్టేషన్‌ను మంగళవారం సీఐ సుబ్రహ్మణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. కమలాపురం తండాకు చెందిన నాగభూషణనాయక్ అనే వ్యక్తి స్థానిక గోల్డాన్ డాబాలో పనిచేసేవాడు. రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్లే క్రమంలో వైజంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా అనంతపురం నుంచి గుత్తివైపు వెళ్లే కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా వడ్డే రమేష్

గుంతకల్లుటౌన్: బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా వడ్డే రమేష్ నియమితులయ్యారు. మంగళవారం ఇల్లూరుభవన్‌లో జరిగిన సమావేశంలో వడ్డేరమేష్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు నియామక ఉత్తర్వులను అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రమేష్ పేర్కొన్నారు.

దిశ యాప్ బాలికలు, మహిళలకు శ్రీరామరక్ష

పెద్దపప్పూరు: బాలికలు, మహిళలకు దిశ యాప్ శ్రీరామరక్షగా నిలుస్తోందని ఎస్ఐ శరత్‌చంద్ర పేర్కొన్నారు. జూటూరులోని కేజీబీవీలో మంగళవారం ఆయన విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం దిశ యాప్‌ను ఆవిష్కరించిందన్నారు. దీంతో ఆపదలో ఉన్న మహిళలకు తక్షణమే పోలీసుల సాయం అందుతుందన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



జెండా కట్ట వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని బండా మసీదు సమీపంలోని జెండా కట్ట వద్ద మంగళవారం గ్యార్మీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్యార్మీ జెండాను ప్రత్యేకంగా అలంకరించి వీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా జెండా కట్టను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ నేత హీరాపురం ఫయాజ్‌బాషా, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, వైస్ చైర్మన్ మహబుబ్‌బాషా ప్రత్యేక ప్రార్థలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడండి

గార్లదిన్నె: కోటంకలో 243–1 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరా. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రాళ్ల గుట్ట ఆక్రమణ కాకుండా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళన చేశారు. స్పందించిన తహసీల్దార్ ఉషారాణి గుట్టలోకి ఎవ్వరు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వవడంతో వారు శాంతించారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష



మాలధారులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

యాడికి: స్థానిక బుగ్గ రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాల ధరించిన భక్తులకు మండల ఆర్యవైశ్య సంఘం సభ్యుడు శ్రీనివాసులు పద్మావతి దంపతుల కుమారుడు ప్రదీప్ మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. గురుస్వామి హరినాథ్, దాదాపు అయ్యప్ప మాలధారులు 400 మంది పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ట



బొడ్రాయి ప్రతిష్టలో పాల్గొన్న మహిళలు

గార్లదిన్నె: కనంపల్లిలో మంగళవారం బొడ్రాయి ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఉదయమే బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో కలశాలతో తరలివచ్చి బొడ్రాయికి పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం వస్తు కలశాధారన, అగ్ని ప్రతిష్టాపన దీక్ష, హోమం తదితర పూజలు చేశారు.

విద్యుత్ స్తంభాలు తాకొద్దు

యల్లనూరు: తుఫాన్ కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశముందని, ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ పద్మనాభ రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తడిసిన విద్యుత్ స్తంభాలు కాని ఇతర విద్యుత్ వస్తువులు, పరికరాలు తాకొద్దని సూచించారు.

